క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, సాయంత్రం పూజలు, పల్లకిసేవ గావించారు.

రంగడి హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాయకుల స్వామి హుండీ కానుకల లెక్కింపు మంగళవారం జరిగింది. స్వామికి గతేడాది నవంబర్ 8 నుంచి భక్తులు రూ.16,62,825లు కానుకగా సమర్పించారని ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీవెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానం ఈఓ వి.ఉష, జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ డి.సాయిచైతన్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలపై శిక్షణ తరగతులు



నెల్లూరు(బారకాసు): ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ వికాస్ మర్మత్, నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

పరీక్ష సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 1500 మందికి పరీక్ష సామగ్రిని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం అందజేశారు. నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం, అప్పల సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను బాగా రాయాలని సూచించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బైసాని జ్యోతిప్రసాద్, కోశాధికారి ఒమ్మిన మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ సురేష్, మాజీ చైర్మన్ సుంకు మనోహర్, వైభవ్ శ్రీనివాసులు, ఫణీంద్ర, సతీష్, నున్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

3న సాహితీ ఫౌండేషన్ అక్షరోత్సవం

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అక్షరోత్సవాన్ని మార్చి మూడున నిర్వహించనున్నామని నిర్వాహకులు కళాంజలి అనంత్, దువ్వూరు బెనర్జీ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదిత్యనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ముఖ్య అతిథిగా నందమూరి లక్ష్మీపార్వతి హాజరుకానున్నారని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులకు అవార్డులను అందజేయనున్నారని పేర్కొన్నారు. చిన్ని నారాయణరావు, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రగతిబాటలో బ్రహ్మదేవి



బ్రహ్మదేవిలోని సచివాలయ భవనం



గిరిజనకాలనీలో నాడు-నేడు కింద ముస్తాబైన పాఠశాల

- రూ.26 కోట్లతో అభివృద్ధి
- ప్రతివీధిలో సీసీరోడ్లు

బ్రహ్మదేవి సచివాలయం-1 పరిధిలో..	
నాన్ డీబీటీ ద్వారా జరిగిన లబ్ధి	రూ.9,03,14,952
డీబీటీ ద్వారా జరిగిన లబ్ధి	రూ.16,15,91,594
మొత్తంగా జరిగిన లబ్ధి	రూ.26,09,06,546
జగనన్న కాలనీలు	2

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో శరవేగంగా అభివృద్ధి చెందిన పంచాయతీల్లో మండలంలోని బ్రహ్మదేవి ఒకటి. అధిక సంఖ్యలో ఉన్న మజరా గ్రామాల్లో అడుగడుగునా ప్రగతి దర్శనమిస్తోంది. సచివాలయం నిర్మాణంతో బ్రహ్మదేవి ప్రధాన గ్రామానికి కొత్త కళ వచ్చింది. దీనితో పాటు రంగాచార్యులకండ్రిగ, ఈదులవారిపాళెం, గిరిజనకాలనీ, కోమటిగుంట, లింగాయపాళెం, గోవిందరెడ్డిపాళెం, పెట్రోల్‌బంకు సంఘం, గురవయ్యసాల, వెడిచర్లమిట్ట తదితర మజరా గ్రామాల్లో సీసీరోడ్లు, సైడు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. నాలుగు మజరా గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్లో అదనపు గదుల నిర్మాణం జరుగుతుండగా, గోవిందరెడ్డిపాళెం, బ్రహ్మదేవి మెయిన్, గిరిజనకాలనీలోని ప్రాథమిక పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. బ్రహ్మదేవి గిరిజనకాలనీలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణం జరుగుతుండగా, ఇదే విధంగా ఈదులవారిపాళెం జగనన్న లేఅవుట్‌లో 34, బ్రహ్మదేవి మెయిన్ 130 పక్కాగృహాల నిర్మాణం జరుగుతోంది. ఐదేళ్ల పాలన పూర్తయ్యే లోపు అభివృద్ధి పనులు పూర్తి చేసి, ప్రజల ఆదరణ చూరగొనాలని పార్టీ శ్రేణులు నిర్ణయించాయి.



పాత హాస్టల్ వీధిలో నిర్మించిన సీసీరోడ్డు

ఊహించని విధంగా అభివృద్ధి



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సహకారం వల్ల ఐదేళ్ల పాలనలో బ్రహ్మదేవి పంచాయతీ ఊహించని విధంగా అభివృద్ధి జరిగింది. అడుగడుగునా ప్రగతి దర్శనమిస్తోంది.

– షేక్ అబ్దుల్ జమీల్, స్థానికుడు

కనీవినీ ఎరుగని ప్రగతి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పనులు ఎన్నడూ ఎరుగని విధంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి కృషి వల్ల మౌలిక సదుపాయాలన్నీ పూర్తవుతున్నాయి.

– షేక్ మస్తాన్, స్థానికుడు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేశారు. గతంలో లేని విధంగా, రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమం అందుతోంది.

– కట్టా సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్

చేపలతో అధిక ప్రయోజనాలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రొఫెసర్

ముత్తుకూరు : చేపలను భుజించడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ముత్తుకూరులోని మత్స్యకళాశాల ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తాళ్లపూడిలో తలపెట్టిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేపల పెంపకం, ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేపలు భుజించడం ద్వారా కంటి జబ్బులు నయమవుతాయన్నారు. ఆక్వాకల్చర్ విభాగం అధిపతి డాక్టర్ ఆనందప్రసాద్ మాట్లాడుతూ, చేపల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు త్రివేణి, శ్రీవిద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఆర్వో శ్రీనివాస్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి(ఆర్వో) శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై కమిషనర్ రమణబాబు, బూత్ లెవల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలిస్తున్నామన్నారు. ఏమైనా పెండింగ్ పనులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.



కోవూరు : అధికారులతో మాట్లాడుతున్న ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు

సిబ్బంది వసతి ఏర్పాట్లపై ఆరా

కోవూరు : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బందోబస్తుగా వస్తున్న పోలీస్ సిబ్బందికి వసతి ఏర్పాట్ల కోసం నెల్లూరు ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు కోవూరులోని కేఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని మంగళవారం పరిశీలించారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను ఆయన ఆదేశించారు. రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులు ఉన్నారు

మహాభారతం చదివేలా ప్రోత్సహించాలి



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

వెంకటాచలం : విద్యార్థులను మహా భారతం చదివేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సహస్రావధాని మేడసాని మోహన్ పేర్కొన్నారు. మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మహా భారతం- భారతీయ దార్శనికత అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడసాని మోహన్ మాట్లాడుతూ గొప్ప జీవితాన్ని అలవర్చుకోవాలంటే భారతం చదవాలని, మహాభారతంలో ఉన్నదంతా లోకంలో ఉందని తెలియజేశారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు మహాభారతం గురించి వివరించి చదివించేలా ప్రోత్సహించాలన్నారు. డీకేడబ్ల్యూ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.గిరి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు దేవిరెడ్డి విజయలక్ష్మి, అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ తదితరులు మహా భారతంలోనే అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పండితులు, విద్యాత్మక, కార్యనిర్వాహక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నేడు

వెంకటాచలం : మండలంలోని అన్నీ గ్రామాల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై బుధవారం సోషల్ ఆడిట్ జరుగుతుందని ఎంపీడీఓ ముజీబున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ఆడిట్ ప్రారంభమవుతుందని, జాతీయ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు కావాలని సూచించారు.

ఈ-కేవైసీకి నేడు తుది గడువు

కొడవలూరు: పంట నమోదు, ఈ-కేవైసీలకు బుధవారం తుది గడువుగా ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు ఏఓ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు పంట నమోదు చేసుకోని రైతులు బుధవారం తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలన్నారు. ఇవి పూర్తయిన రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు, పంట బీమా, పంట నష్టం తదితర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని చెప్పారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు చేసుకోవడంతో పాటు ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): సీఏఎం హైస్కూల్ సమీపంలోని ఉమామహేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలను మార్చి తొమ్మిది వరకు నిర్వహించనున్నామని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త బాలాజీసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పల్లకిసేవ, పంచ హారతులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నాయని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

పాడిరైతులకు అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలపై వారిలో అవగాహన పెంచేలా పశు వైద్యులు, సహాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు అన్నారు. కోవూరు మండలం వేగూరు, లేగుంటపాడు, ఇనమడుగు గ్రామాల్లో పశు వైద్యశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తితో పలు విషయాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న పశు సహాయకులు వారి పరిధిలో పశు విజ్ఞాన బడి, ఇతర ప్రత్యేక కార్యక్రమాలపై అవగాహన పెంచేలా చూడాలన్నారు. అదేవిధంగా వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ గర్భధారణపై అపోహలు తొలగించి మేలుజాతి పశు ఉత్పత్తికి తోడ్పడేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా వార్షికోత్సవం



అభిషేకం చేస్తున్న అర్చకులు



బంగారు చీరలో అమ్మవారు

కోవూరు : పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నందకిశోర్‌స్వామి ఆధ్వర్యంలో మండపారాధన, సర్వదేవతా హోమాలను సాంప్రదాయబద్ధంగా జరిపించారు. అనంతరం మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత వైభవంగా చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం గావించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బంగారు చీరలో అమ్మవారి దర్శనం

విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూలంగి సేవ, పల్లకిసేవను వైభవంగా జరిపించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.రమేష్‌బాబు, కోశాధికారి ఎం.రమేష్‌బాబు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించేలా సంబంధిత అధికారుల నిరంతరం పర్యవేక్షించాలని రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సెక్టార్ ఆఫీసర్, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో సమస్యలు తలెత్తితే రిటర్నింగ్ అధికారి దృష్టికి వెంటనే తీసుకురావాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, బ్యారికేడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇంటర్నెట్, టెలిఫోన్, సీసీ కెమెరాలు, ఫర్నిచర్ తదితరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యాత్మక పరిస్థితులు తలెత్తకుండా చూడాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం వీల్‌చైర్లు, ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, వెంకటేశ్వరరావు, టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అపోహలొద్దు

ఓటరు జాబితాపై ఎలాంటి అపోహలకు తావు లేదని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. పార్టీల ప్రతినిధులు కొన్ని అంశాలను తెలియజేయగా, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఓటరు దరఖాస్తులపై పారదర్శకంగా విచారణ జరిపి.. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు సవరణలు చేపడుతున్నామని తెలిపారు. డబుల్ ఎంట్రీ, డోర్ నంబర్ లేని ఓటరు జాబితాలపై బీఎల్వోలతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. టీడీపీ ప్రతినిధులు భువనేశ్వరిప్రసాద్, హరికృష్ణ, పూజిత్, ఎన్నికల విభాగం నుంచి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై రిటర్నింగ్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న బాపిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న ఎన్నికల సందర్భంగా ఈవీఎంలకు గానూ నియోజకవర్గానికో ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేయనున్నామని జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, నుడా వీసీ బాపిరెడ్డి పేర్కొన్నారు. ఈవీఎంలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈవీఎంలపై పలు అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఈవీఎంల పనితీరులో సాంకేతిక సమస్యలొస్తే ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేశారు. తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత గ్రామాల్లో చిచ్చుపెడితే సహించం

- వైఎస్సార్‌సీపీ నేతల వెల్లడి



మనుబోలు : మాట్లాడుతున్న ఆదినారాయణ



పొదలకూరు : మాట్లాడుతున్న నాయకులు

మనుబోలు : ప్రశాంతమైన గ్రామాల్లో టీడీపీ నేత సోమిరెడ్డి చిచ్చు పెడుతున్నాడని, ఇది మంచి పద్ధతి కాదని, వీటిని సహించేది లేదని కట్టువపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గుండాల ఆదినారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్ అన్నారు. మనుబోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కట్టువపల్లిలో సోమవారం జరిగిన ఓ టీడీపీ కార్యక్రమంలో తలెత్తిన చిన్న గొడవను అడ్డం పెట్టుకుని సోమిరెడ్డి టీడీపీ కార్యకర్తలను తమ పార్టీ దళిత నేతపైకి ఉసిగొల్పడం దారుణమన్నారు. తమ నాయకుడు కాకాణి ప్రోత్సాహంతో గత ఐదేళ్లుగా కట్టువపల్లిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, గతంలో ఎప్పుడూ గొడవలు జరిగింది లేదన్నారు. అలాంటి ఆదర్శ గ్రామంలో సోమిరెడ్డి చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. చిన్న పొరపాట్ల వల్ల ఘర్షణ వాతావరణం ఏర్పడినప్పుడు నాయకుడు సర్దిచెప్పుకుని సమన్వయం చేసుకోవాలని, ఇందుకు భిన్నంగా సోమిరెడ్డి బాధ్యతారాహిత్యంగా దాడులను ప్రోత్సహించడం దిగజారుడు రాజకీయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు జానకిరామిరెడ్డి, పోచారెడ్డి అశోక్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, గుంజి రమేష్, చల్లా నవకోటి, దాసరి మహేంద్రవర్మ, కేవీఆర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత హేయం

పొదలకూరు : మనుబోలు మండలం కట్టువపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటయ్యపై దాడి చేయించి తిరిగి అతడిపైనే సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయించిన వైనం అత్యంత హేయమని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి చెందిన వెంకటయ్యను తరిమి తరిమి కొట్టి పచ్చమీడియాలో వెంకటయ్య దాడి చేసినట్లు ప్రచారం చేయించారని, సోమిరెడ్డి ఏ గ్రామానికి వెళ్లినా ఘర్షణలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకుంటాడని మండిపడ్డారు. మంత్రి కాకాణి ఏనాడూ ఘర్షణలను ప్రోత్సహించరని, ఆయన ప్రోత్సహిస్తే సోమిరెడ్డి గ్రామాల్లో తిరగలేడని పేర్కొన్నారు. సమావేశంలో పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ ఎం.శేఖర్‌బాబు, శివాలయం డైరెక్టర్ డి.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాదర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూకోటి లక్ష్మీనారాయణ, నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, అంజాద్, జి.వేణుగోపాల్‌రెడ్డి, బి.భారతమ్మ, లక్ష్మయ్య, హరి, రమేష్ పాల్గొన్నారు.